క్లుప్తంగా

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు



నగరం: స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బండ్ల భార్గవ్ విలేకరులకు తెలిపారు. ఎస్‌ఐ సమాచారం మేరకు చీరాల వన్‌టౌన్‌కు చెందిన అన్నపురెడ్డి గోపి గతేడాది నవంబర్ 10వ తేదీన అదే గ్రామానికి చెందిన ఆంజనేయులతో కలిసి లైటింగ్ పనుల కోసం మండలంలోని మంత్రిపాలెం శివారు బొడ్డువారిపాలెం గ్రామంకు వచ్చాడు. అప్పటి నుంచి ఇంటికి తిరిగి వెళ్లలేదు. దీంతో కుటుంబ సభ్యులు నవంబర్ 12వ తేదీ 2024 నుంచి గోపి కనబడుట లేదని ఆదివారం చీరాల టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో జీరో ఎఫ్ఐఆర్‌గా కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు నిమిత్తం నగరం స్టేషన్‌కు బదిలీ చేసినట్లు పేర్కొన్నారు. గోపి వయస్సు 45 సంవత్సరాలు ఉంటుందని మతి స్థిమితం లేకుండా తిరుగుతాడని వెల్లడించారు. గోపి గురించి ఎవరికైనా ఆచూకీ తెలిస్తే నగరం పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



బాపట్ల: సూర్యలంక కోస్టల్ సెక్యూరిటీ పోలీసులు, యజ్ఞ హాస్పిటల్ ఆధ్వర్యంలో మత్స్యకార గ్రామాల్లో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ యజ్ఞ శ్రీకాంత్ బెల్లంకొండ, డాక్టర్ మాధవి బెల్లకొండ, డాక్టర్ టి.పవన్‌కుమార్ ఆధ్వర్యంలో రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరానికి ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి పరీక్షలు చేయించుకున్నారు.

బాపట్లలో రక్తదాన శిబిరం



బాపట్ల: అన్ని దానాల్లో రక్తదానం మిన్న అని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ డాక్టర బి.శరత్‌బోస్ పేర్కొన్నారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఎకో హౌస్ ఉచిత రక్తదానం, అవయవదానం కార్యక్రమం ఆదివారం చేపట్టారు. ఈ శిబిరంలో 17 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేయగా, 12 మంది అవయవదానం, 11 మంది శరీర దానం చేసేందుకు ముందుకొచ్చారు. సంస్థ చైర్మన్ డాక్టరు బి.శరత్‌బోస్ మాట్లాడుతూ వేరొకరి జీవితాన్ని కాపాడటానికి మించిన దానం ఇంకొకటి లేదని తెలిపారు. మానవతా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు బొంగులూరు హరిప్రసాద్ మాట్లాడుతూ ప్రతి నెల సంస్థ తరపున ఒక సేవా కార్యక్రమంలో భాగంగా ఈ వారం ఈ కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. సేవా సంస్థ బాపట్ల శాఖ ప్రధాన కార్యదర్శి గురజాల శ్రీనివాసరావు, చీరాల అధ్యక్షుడు ఎ.నాగ వీరభద్రాచారి, సెక్రటరీ వడలి రాధాకృష్ణ, కోశాధికారి గుత్తి శివకుమార్, బాపట్ల శాఖ ఉపాధ్యక్షుడు అల్లాడి రవికుమార్, మహిళా సమైక్య అధ్యక్షురాలు కోలా పద్మజ, సంస్థ మహిళా కార్యదర్శి కర్పూరపు మంజులత, బాపట్ల శాఖ కోశాధికారి సన్నంశెట్టి కేసువులు, జాయింట్ సెక్రటరీ ఎం.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు చైర్మన్‌కు వినతిపత్రం అందజేత



మంగళగిరి టౌన్: రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్, డైరెక్టర్ షేక్ అక్రమ్‌లకు మంగళగిరి నగరంలోని వివిధ జమాత్‌లకు చెందిన ముస్లిం ప్రతినిధులు ఆదివారం వినతిప్రతాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ముస్లిం ప్రతినిధులు మాట్లాడుతూ.. నగరంలోని ముస్లిం శ్మశాన వాటిక (ఖబర్‌స్థాన్) పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరామని, నగరంలో 20 ఏళ్లుగా ఉన్న ముస్లిం శ్మశాన వాటికను రహదారి విస్తరణ పేరుతో కొంత భాగాన్ని తొలగించాలన్న మున్సిపాలిటీ ప్రతిపాదనపై తాము అభ్యంతరం వ్యక్తం చేస్తున్నామని వివరించినట్లు తెలిపారు. ఈ ఖబర్‌స్థాన్ వక్ఫ్‌బోర్డు నోటిఫై చేసిన స్థలం కావడంతో దీని పరరక్షణ కూడా వక్ఫ్‌బోర్డు బాధ్యతగా తీసుకోవాలని వినతిపత్రంలో కోరామని పేర్కొన్నారు.

కొనసాగుతున్న ఏసీసీ కార్మికుల దీక్షలు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలు ఆదివారానికి 229వ రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరాన్ని సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు ప్రారంభించి మాట్లాడారు. ఏసీసీ కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఎన్నికలకు ముందు లోకేష్ ఈ ప్రాంతంలో పర్యటించినప్పుడు కార్మికులకు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు కూరపాటి స్టీవెన్, ఆదినారాయణ, కార్మికులు నవనీతం, దానయ్య, గురవయ్య, సారమ్మ, దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.

గద్దెనెక్కించిన ప్రజలను
మోసగిస్తున్న చంద్రబాబు

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు
- సూపర్‌సిక్స్ హామీలు అందలేదని వాపోతున్న పేదవర్గాలు



కూటమి ప్రభుత్వ మోసాన్ని ప్రజలకు వివరిస్తున్న వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి

భట్టిప్రోలు : అందలం కోసం అబద్ధపు హామీలను గుప్పించిన చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకుండా ప్రజలను మోసగిస్తూ పబ్బం గడుపుకుంటున్నాడని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం మండలంలోని చింతమోటు, పెసర్లంక, పెదలంక గ్రామాల్లో వర్షం సైతం లెక్కచేయకుండా కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజలలోకి తీసుకువెళ్లేందుకు తలపెట్టిన బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడం వల్ల ఒక్కో కుటుంబానికి వాటిల్లుతున్న నష్టం గురించి వివరించారు.

- ఈ సందర్భంగా మండలంలోని చింతమోటులో రావుల జయరావు, సుధారాణి దంపతులు తమ పిల్లలు ముగ్గురికి తల్లికి వందనం నగదు జమ కాలేదని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయన అబద్ధపు హామీలపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి లోకేష్‌లను నిలదీశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన సంక్షేమ పథకాలకు పేర్లు మార్చి ప్రజలను మభ్యపెట్టి అధికారం దక్కించుకొని నేడు లబ్ధిదారులకు పథకాలు అమలు చేయకుండా మోసగించడం ఎంత వరకు సమంజసమో సమాధానం చెప్పాలని అన్నారు. పేద వర్గాలను కూటమి ప్రభుత్వం అణగదొక్కుతుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళలు, రైతులు, నిరుద్యోగులను మోసగిస్తూ పథకాలను అమలు చేయకుండానే చేశామని చెప్పుకుంటోందని విమర్శించారు. కూటమి ప్రభుత్వ మోసాలను ప్రతి ఒక్కరూ గమనించాలని ప్రజలకు సూచించారు. గత ఎన్నికల్లో కూటమి అబద్ధపు హామీలను నమ్మి ఓట్లేసిన ప్రజలు ఓటమి చెందారన్న విషయాన్ని గ్రహించాలని కోరారు.
- తొలుత మండలంలోని వెల్లటూరు నుంచి పార్టీ శ్రేణులతో కలసి ఆయన ద్విచక్ర వాహనాలపై ర్యాలీగా కార్యక్రమానికి తరలివెళ్లారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పడమట శ్రీనివాసరావు, ఎంపీపీ దావులూరి లలితకుమారి, ఎంపీటీసీ సభ్యులు నన్నెపాముల చంటి, కొతరపు పద్మావతి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగ జాయింట్ సెక్రటరీ జల్లి జోషికాంత్, భట్టిప్రోలు టౌన్ కన్వీనర్ కుందేటి రమేష్, సోషల్ మీడియ జిల్లా అధ్యక్షుడు వాసుమళ్ల రోహిత్, నియోజకవర్గ సోషల్ మీడియా అధ్యక్షుడు బాణాల తనీష్, నాయకులు కారుమూరి నరేష్, జంపని రవిబాబు, శొంటి కామేశ్వరరావు, గుంటూరు జ్యోతి, రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పలు చోట్ల అమ్మవార్లకు శాకంబరిగా అలంకరణ



వేమవరంలో శాకంబరి అలంకారంలో పోలేరమ్మ అమ్మవారు



శాకంబరిగా భక్తులకు దర్శనమిస్తున్న మహాలక్ష్మి గుండెపాటమ్మ అమ్మవారు



శాకంబరి అలంకరణలో అల్లూరమ్మ అమ్మవారు

రేపల్లె: మండలంలోని పేటేరు గ్రామంలో శ్రీమహాలక్ష్మి గుండెపాటమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం శాకంబరి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. వేకువజామున ఆలయ అర్చకుడు సుమంత్ ఆధ్వర్యంలో అమ్మవారికి సుప్రభాత సేవ, పంచామృతాలు, పండ్ల రసాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి పట్టువస్త్రాలు, కూరగాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారిని ఉదయం నుంచి భక్తులు దర్శనం చేసుకుని పసుపు, కుంకుమ, గాజులు, నూతన వస్త్రాలు, పండ్లతో కూడిన సారెను సమర్పించి పెరుగన్నం, గారెలతో కూడిన చద్ది నైవేద్యాలు సమర్పించారు. గ్రామంలోని రైతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి సకాలంలో వర్షాలు పడి పాడి పంటలతో చల్లగా చూడాలని మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ఆవరణలో కూరగాయాలతో చేసిన అమ్మవారి రూపు, శివలింగాకృతులు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

వేమవరంలో...

వేమవరం(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం సూరేపల్లి పంచాయతీ పరిధిలోని వేమవరంకు చెందిన భక్తుల కొంగు బంగారమై విరాజిల్లుతున్న గ్రామ దేవత పోలేరమ్మ అమ్మవారు ఆదివారం శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని జై పోలేరమ్మ మాత.. పాహిమాం.. రక్షమాం అంటూ ప్రార్థించారు.

శాకంబరిగా అల్లూరమ్మ

అల్లూరు(కర్లపాలెం): అల్లూరు గ్రామంలో వేంచేసి యున్న భక్తుల కొంగుబంగారంగా భాసిల్లుతున్న అల్లూరమ్మ అమ్మవారు ఆదివారం శాకంబరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామంలో ప్రముఖ వైద్యుడు గాదె శ్రీనివాస్, లక్ష్మీ దంపతుల ఆధ్వర్యంలో భక్తులు అల్లూరమ్మ అమ్మవారిని పలు రకాల కూరగాయలతో శాకింబరి దేవిగా అలంకరించారు. ఆషాఢ మాసం పురస్కరించుకుని అమ్మవారికి సారె సమర్పించి విశేష పూజలు నిర్వహించారు.

ప్రసన్న దుర్గ భవానీ మాతకు ఆషాఢ సారె



అమ్మవారికి సారె తీసుకువెళుతున్న భక్తులు

బాపట్ల అర్బన్: ఆషాఢ మాసం చివరి ఆదివారం సందర్భంగా బాపట్ల పట్టణం భక్తి పారవశ్యంతో నిండిపోయింది. 13వ వార్డు ఎస్‌ఎన్‌పీ అగ్రహారంలో కొలువై ఉన్న ప్రసన్న దుర్గభవానీ మాత ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో అమ్మవారికి ఆషాఢ సారె సమర్పించారు. మహిళలందరూ అమ్మవారి ప్రతిమను తలపై మోస్తూ, బాపట్ల పట్టణ అధిష్టాన దేవత అయిన గ్రామ దేవత పోలేరమ్మ తల్లిని దర్శించుకున్నారు. పోలేరమ్మ తల్లికి చీర, గాజులు, పసుపుకుంకుమలు, పొంగలి, పులిహోర, చలిమిడి వంటి నైవేద్యాలను, సారెను సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. అనంతరం ఇతర దేవాలయాలను కూడా దర్శించుకొని చివరగా ప్రసన్న దుర్గ భవానీ మాత ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారు శాకంబరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని, భజనలు, అన్నదాన కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ ఉత్సవాలు బాపట్లలో ఆధ్యాత్మిక శోభను రెట్టింపు చేశాయి.

ఐనపాలెంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం



ఐనపాలెంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం వైఎస్సార్‌సీపీ నాయకులు

చుండూరు(వేమూరు): ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలకు చేసిన మోసం గురించి ప్రతి ఇంటికి తెలియజేయటం జరిగిందని వైఎస్సార్‌సీపీ మాజీ జెడ్పీటీసీ గాదె శివరామకృష్ణా రెడ్డి తెలిపారు. చుండూరు మండలంలోని వలివేరు గ్రామ పంచాయతీ పరిధిలోని ఐనపాలెం గ్రామంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ఏడాది కాలంలో చంద్రబాబు మహిళలను చేసిన మోసం గురించి తెలియజేశారు. వర్షాలు వల్ల వెద సాగు చేసిన పొలాలు మునిగిపోయాయని, మునిగిపోయిన వెదసాగు రైతులను ఆదుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో చీడిపూడి సాంబరెడ్డి, పందిపాటి ఏసు, అమర్తలూరు ప్రవీణ్, చీడిపూడి దేవేంద్ర రెడ్డి, దాట్ల వీరమ్మ, రవీంద్ర, నూతలపాటి బుజ్జి, జూపల్లి బాలస్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

25 నుంచి పెదపులివర్రు గోగులమ్మకు ప్రత్యేక పూజలు



పెదపులివర్రు(భట్టిప్రోలు): శ్రావణ మాసం ఈ నెల 25 నుంచి వచ్చే నెల 23వ తేదీ వరకు పురస్కరించుకుని వ్యాఘ్రపుర క్షేత్ర గ్రామ అధిష్ఠాన దేవత గోగులమ్మ అమ్మవారికి నెల రోజులపాటు కుంకుమార్చనలు జరుగుతాయని అర్చకులు ఆదివారం తెలిపారు. భక్తులు ప్రత్యేక పూజలకు పేర్లు నమోదు చేయించుకోవచ్చునని పేర్కొన్నారు. నిత్య పూజ కైంకర్యాలతో, విరాజిల్లుతూ అమ్మవారికి ప్రాతః కాలంలో పూజలు నిర్వహించి భక్తులను కటాక్షిస్తూ అమ్మవారు దర్శనమిస్తారన్నారు.

ప్రమాదవశాత్తూ చెరువులో మునిగి వ్యక్తి మృతి

పెనుమర్రు(వేమూరు): ప్రమాదవశాత్తూ చెరువు నీటిలో మునిగి గొరికపూడి జీవన్ (26) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వేమూరు మండలంలోని పెనుమర్రు గ్రామం చెరువులో చేపలు చనిపోయాయి. ఆదివారం ఉదయం చనిపోయిన చేపలను తీసేందుకు చెరువులో జీవన్ దిగి, మునిగిపోయి మృతి చెందాడని ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు. తండ్రి గొరికపూడి జీవరత్నం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. పోస్టుమార్టం నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించడం జరిగిందని ఎస్‌ఐ తెలిపారు.

పాండురంగస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు

బాపట్ల అర్బన్: స్థానిక బాపట్ల చీలురోడ్డులో వేంచేసి ఉన్న రుక్మిణి సమేత పాండురంగ స్వామి దేవాలయ ప్రాంగణంలో కొలువుదీరి ఉన్న లలితా త్రిపుర సుందరి దేవి అమ్మవారికి ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని ఆదివారం ఉమామహేశ్వర భక్త బృందం ఆధ్వర్యంలో సారె సమర్పించారు. అనంతరం లలితా త్రిపుర సుందరీ దేవి అమ్మవారికి పంచామృతాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు. లలితా సహస్ర నామ సహిత విశేష కుంకుమార్చన కార్యక్రమం, నీరాజనం మంత్రపుష్పాలు, తీర్థ ప్రసాద వినియోగ కార్యక్రమం, భక్తులకు అన్న సంతర్పణ చేశారు. ఆదివారం ఆడికృత్తిక సందర్భంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి విశేష పంచామృత స్థాపన విశేష అలంకరణ, స్వామివారికి పూజా కార్యక్రమం నీరాజనం మంత్రపుష్పాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉమామహేశ్వర భక్త బృందం భక్తులు, మార్టూరి బదరీ నారాయణ దంపతులు, మురళి వెంకటరమణ దంపతులు, ఆలయ అర్చకులు రొంపిచర్ల కేశవాచార్యులు, చంద్ర శ్రీ మణికంఠ పాల్గొన్నారు.

అవినీతి అధికారులకు పోస్టింగా..!




మండల పరిషత్ కార్యాలంలో ఏపీవోగా పని చేస్తున్న సత్యకృష్ణ

వేమూరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు భారీ స్థాయిలో స్వాహా చేసి ఏపీవోకు మరలా పోస్టింగ్ ఇవ్వడంతో అధికారుల్లో చర్చ మొదలయింది. మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ గ్రామీణ ఉపాధి పథకం కార్యాలయంలో ఏపీవోగా సత్యకృష్ణ ఉద్యోగం చేస్తున్నాడు. గతంలో రేపల్లె నియోజకవర్గం నగరం మండలంలో ఏపీవోగా పని చేశాడు. జాతీయ గ్రామీణ ఉపాధి పథకం నిధులు స్వాహా చేశాడు. గత మార్చి నెలలో సామాజిక తనిఖీ బృందం గ్రామాల్లో తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో నాలుగు గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం పనులు చేయకుండా చేసినట్లు రికార్డు చేసి రూ.17 లక్షలు స్వాహా చేసినట్లు సామాజిక తనిఖీ బృందం గుర్తించి నిర్ధారణ చేశారు. దీనిపై మండలంలో ఏపీవో సహా సీవో, ఈసీ, టీఏలను ఏప్రిల్ 29వ తేదీన సస్పెండ్ చేశారు. నెల రోజులు తిరగక ముందే ఏపీవో సత్యకృష్ణకు జిల్లా డ్వామా అధికారులు మరలా వేమూరు మండల పరిషత్ కార్యాలయంలో ఏపీవోగా పోస్టింగ్ ఇవ్వడం జరిగింది. కూటమి ప్రభుత్వం అవినీతి అధికారులకు పోస్టింగ్‌లు ఇవ్వడంతో వారిని ప్రోత్సహించడం జరుగుతుందని పలువురు అధికారుల మధ్య గుసగుసలు మొదలయ్యాయి. 2014లో చెరుకుపల్లి మండలంలో ఏపీవోగా పని చేస్తూ ఉపాధి పథకం నిధులు స్వాహా చేయడంతో సస్పెండ్ చేశారు. అమర్తలూరు మండలంలో ఏపీవోగా పని చేశాడు. అక్కడ కూడా ఉపాధి పథకం నిధులు స్వాహా చేశాడు. తర్వాత వేమూరు మండల పరిషత్ కార్యాలయంలో ఏపీవోగా పని చేస్తున్నాడు. ఈ మండలంలో కూడా ఉపాధి పథకం నిధులు స్వాహా చేశాడని కార్యాలయంలోని ఫీల్డ్ అసిస్టెంట్‌ల మధ్య చర్చ జరుగుతుంది.

పోస్ట్ చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయం

పెనుకొండ క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతీ బాలస్వామిజీ



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న స్వామిజీ

తెనాలిటౌన్: మానవ సేవే మాధవ సేవని ప్రతి ఒక్కరూ సేవానిరతి కలిగి ఉండాలని పెనుకొండ క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతీ బాలస్వామిజీ పిలుపునిచ్చారు. కొల్లిపర మండలం కుంచవరం గ్రామంలో ఆంధ్ర ప్రైమ్ హాస్పటల్ ఆధ్వర్యంలో పోస్ట్ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో ఆదివారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ట్రస్ట్ వ్యవస్థాపకుడు టి.శ్రీనివాసరావు, కాకతీయ కో–ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ డీఎల్ కాంతారావు అధ్యక్షతన వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతీ బాలస్వామిజీ పాల్గొని వారాహిమాతకు పూజాది కార్యక్రమాలు నిర్వహించి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ప్రజల సేవార్థం ఇటువంటి వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి వైద్యం అందించడం ముదావహమని నిర్వాహకులను అభినందించారు. ఏపీ ఇండస్ట్రియల్ కార్పొరేషన్ డెవలప్‌మెంట్ చైర్మన్ డేగల ప్రభాకర్ పాల్గొని మాట్లాడారు. మంచి ఆశయాతో పోస్ట్ చారిటబుల్ ట్రస్ట్ చేస్తున్న సేవలను కొనియాడారు. గ్రామీణ ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందించాలనే లక్ష్యంతో ట్రస్ట్ పనిచేస్తుందని అభినందించారు. ఆంధ్ర ప్రైమ్ హాస్పటల్ వైద్యులు రోగులను పరీక్షించి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. డాక్టర్ అన్వేష్, డాక్టర్ కె.సాయి రాజశేఖర్, డాక్టర్ తేజస్వి, డాక్టర్ చెరుకూరి జగదీష్, డాక్టర్ బి.పవన్‌కుమార్, డాక్టర్ సురేష్, డాక్టర్ హిమబిందు, డాక్టర్ మాధవీలత, తదితరులు పాల్గొన్నారు.

గంగానమ్మకు బోనాలు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని గుండిమెడలో కొలువైన గంగానమ్మ అమ్మవారికి ఆషాఢ మాసం సందర్భంగా ఆదివారం భక్తులు బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు పాటిబండ్ల నారాయణరావు మాట్లాడుతూ.. శ్రీ గంగానమ్మ తల్లి అమ్మవారికి బోనాల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించామని తెలిపారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కారసనేని అంకినేయుడు, లక్ష్మీ పార్వతి, పాటిబండ్ల నారాయణరావు, గాయత్రీదేవి, వెంకట సాంబ శివప్రసాదరావు, నాగరాజ కుమారి, మొవ్వ నాగేశ్వరరావు, జె.శివ, పి.గాయత్రీదేవి, కసారినేని సుస్మ, కసుకుర్తి లింగేశ్వరరావు, కసుకుర్తి జయలక్ష్మి, మేడికొండ ఉమామహేశ్వరరావు, నాగ శిరోణి, పరుచూరి భాస్కరాచారి తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాల: ఈ యేడు వర్షాలు బాగా కురిసి పంటలు బాగా పండాలని గ్రామ దేవతలైన గంగానమ్మ తల్లి, గోగులమ్మతల్లికి ఆదివారం ఈమని గ్రామంలో జలాభిషేకం నిర్వహించారు. గ్రామంలోని భక్తులు మేళతాలాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి జలాభిషేకం నిర్వహించారు. ధరణికోట సాంబయ్య పూజలు నిర్వహించగా ఏర్పాట్లను మాజీ యార్డు డైరెక్టర్ కుప్పాల శ్రీరాంమూర్తి పర్యవేక్షించారు.

విద్యార్థులకు దాతల సాయం ఎనలేనిది



విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, స్టేషనరీ అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

భట్టిప్రోలు : పేద వర్గాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు దాతలు అందించే సాయం ఎనలేనిదని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు అన్నారు. ఆదివారం స్థానిక పద్మశాలీయ కల్యాణ మండపంలో శ్రీ మార్కండేయ పద్మశాలీయ బహూత్తమ సేవా సంఘం నేతృత్వంలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, స్టేషనరీ, స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే దాతలు సమకూర్చిన పుస్తకాలు, స్టేషనరీని విద్యార్థులకు అందజేశారు. బట్టు వీరనారాయణమూర్తి జ్ఞాపకార్థం ఆయన సతీమణి నాంచారమ్మ, కుమారులు బాలమస్తాన్ రావు, మల్లిఖార్జునరావు, అంజయ్యలు నోట్‌పుస్తకాలు, స్టేషనరీ సమకూర్చగా, పదో తరగతిలో 500 పైబడి మార్కులు సాధించిన 15 మంది విద్యార్థులకు గాత్రం భావన్నారయణ రూ.30 వేలు స్కాలర్‌షిప్‌ల రూపంలో అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. బట్టు మల్లిఖార్జునరావు అధ్యక్షతన వహించగా జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, సంఘ ప్రధాన కార్యదర్శి ఎం.సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు పి.శివ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీని ఆధునీకరించాలని టీడీపీ శ్రేణులు ఎమ్మెల్యేకు మొర

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు నిరసనతో చలనం



డ్రైనేజీ సమస్యలను ఎమ్మెల్యే తెలియజేస్తున్న భట్టిప్రోలు మండల నాయకులు

భట్టిప్రోలు : ఖరీఫ్‌లో సాగు చేసిన వరి పంట ముంపుకు కారణమవుతున్న డ్రైనేజీని ఆధునీకరించి రైతులను ఆదుకోవాలని టీడీపీ శ్రేణులు వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు వద్ద మొరపెట్టుకున్నారు. ఆదివారం ఆయన క్యాంపు కార్యాలయంలో కలసిన మండల టీడీపీ నాయకులు డ్రైనేజీ కాలువ తూటికాడ, గుర్రపుడెక్క ఆకులతో నిండిపోవడంతో వరి పంట ముంపు బారిన పడుతుందని ఆయనకు విన్నవించారు. శనివారం భట్టిప్రోలు నుంచి గూడవల్లి గంగోలు వరకు ఉన్న సుమారు మూడు కిలోమీటర్ల పరిధిలోని కాలువలో తూటికాడ, గుర్రపుడెక్కతో నిండిపోవడంతో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, వేమూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి డ్రైనేజీలోకి దిగి సమస్యను పరిశీలించడంతోపాటు, వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేసి కూటమి ప్రభుత్వంలో డ్రైనేజీల పరిస్థితిని కళ్లకు కట్టినట్లు ఎండగట్టారు. ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ నిరసనతో అప్రమత్తమైన కూటమి ప్రభుత్వంలోని టీడీపీ నాయకులు ఎమ్మెల్యేను కలసి సమస్యను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. డ్రైనేజీలో గుర్రపుడెక్క, తూటికాడ పెనవేసుకొని పోయి మురుగు నీరు ముందుకు కదలకుండా నిలిచిపోతుండటంతో సుమారు 3 వేల ఎకరాల ఆయకట్టు ముంపుకు గురవుతుండటంతో రైతులు నష్టపోతున్నారని ఎమ్మెల్యేకు తెలియజేశారు. దీనిపై స్పందించిన ఆయన రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకునే విధంగా అధికారులకు సూచిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండలంలోని పలువురు టీడీపీ నాయకులు తూనుగుంట్ల సాయిబాబా, ఎడ్ల జయశీలరావు, అంజిబాబు, డొక్కు శ్రీనివాసరావు, వంగర వీరయ్య, కంభం సుధీర్, వేల్పూరి వెంకట్రావు, లోకానంద్, ఇర్ఫాన్‌బేగ్, కుంచే వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమాలు ఉధృతం



నిరసన తెలుపుతున్న కార్మికులు

రేపల్లె: న్యాయమైన సమస్యలు పరిష్కరించమంటే ఉద్యమాలు ఉధృతం చేస్తామని మున్సిపల్ ఇంజనీరింగ్ అండ్ వర్కర్స్ యూనియన్ రేపల్లె పట్టణ అధ్యక్షుడు డి.ప్రభాకరరావు అన్నారు. సమస్యలు పరిష్కరించాలని రేపల్లె మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు చేస్తున్న సమ్మె ఆదివారంతో ఏడవ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు జీతాలు పెంచాలని, ఇతర సమస్యలపై నెల రోజుల నుంచి నిరసన తెలుపుతున్నా ప్రభుత్వం స్పందించకపోవటం విచారకరమన్నారు. జీవో 36 ప్రకారం వెంటనే వేతనాలు పెంచాలన్నారు. గతంలో హక్కుల సాధనకు 17 రోజులు చేసిన సమ్మె కాలానికి ఒప్పందం ప్రకారం వేతనాలు, బెనిఫిట్స్ వర్తింపజేయాలన్నారు. ప్రమాదవశాత్తూ కార్మికులు మృతి చెందితే నష్టపరిహారాన్ని రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షలకు పెంచాలని, కార్మికుల దహన సంస్కారాల ఖర్చును రూ.20 వేలకు పెంచాలని, వయో పరిమితి 62 సంవత్సరాలు, గ్రాడ్యుటీ అమలు చేయాలన్నారు. ప్రభుత్వం సమస్యలు పరిష్కరించేంత వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేయటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్, మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు రవి, రాఘవేంద్రరావు, సుబ్బారావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.